క్లుప్తంగా...

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సదానంద్


పాటిల్ సదానంద్ యాదవ్

చార్మినార్: ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా కనుల పండువగా నిర్వహించనున్నామని బేలా చందులాల్‌లోని బేలా మాతేశ్వరి ముత్యాలమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు పాటిల్ సదానంద్ యాదవ్ అన్నారు. 2023 బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన దేవాలయం కమిటీకి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అలాగే దేవాలయం కమిటీ చైర్మన్‌గా పాటిల్ కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులుగా పాటిల్ నవీన్ యాదవ్, పి.విష్ణుమూర్తి, నర్సింగ్ ప్రసాద్ జైశ్వాల్, ప్రధాన కార్యదర్శిగా పాటిల్ రాము యాదవ్, కార్యదర్శులుగా సత్యనారాయణ, పాటిల్ స్వబోధ్ యాదవ్, కోశాధికారిగా పాటిల్ శ్రీనివాస్ యాదవ్‌లు నియమితులయ్యారు.

బోనాలును వైభవంగా నిర్వహిస్తాం

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను వైభవంగా నిర్వహించేందుకు తమ సంపూర్ణ సహకారాలు ఉంటాయని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ టి. అమర్ సింగ్ అన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ జాతర ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి బుధవారం ఆయనకు అందించారు.

'ఓటరు నమోదు'ను సద్వినియోగం చేసుకోండి


ఓటర్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేంద్ర

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలోని ఘాన్సీబజార్ డివిజన్‌లో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నట్లు బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. ఉమా మహేంద్ర అన్నారు. బుధవారం ఘాన్సీబజార్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన సీనియర్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టి.ఉమామహేంద్ర మాట్లాడుతూ... ఇప్పటి వరకు ఓటర్ లిస్టులో తమ పేర్లను నమోదు చేసుకోలేని వారికి తాము ఓటర్ల నమోదు కార్యక్రమం సందర్భంగా నమోదు చేయిస్తామన్నారు.

ఆలయ పైకప్పు పనులు ప్రారంభం



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట న్యూ ఇంద్రానగర్‌లోని సేతుగంగా హనుమాన్ దేవాలయం ఆలయ పైకప్పు పనులను టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ బుధవారం ప్రారంభించారు. బస్తీ వాసులు సొంతంగా ఆలయాన్ని నిర్మించుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉరుకులు, పరుగల దైనందిన జీవితంలో ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు యాదయ్య, రాజు, శ్రీహరి, అంజయ్య, మురళీకృష్ణ, గౌరీ శంకర్, చంద్రశేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

డబీర్‌పురా: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. మీర్‌చౌక్ డీఐ రాంబాబు తెలిపిన మేరకు.. మీర్‌చౌక్ పీఎస్ ప్రాంతంలోని ఇనాయత్ గస్ దేవిడి ప్రాంతానికి చెందిన కౌసర్ బీ (54) మంగళవారం సాయంత్రం లోహికి గల్లీ ప్రాంతం మీదుగా నడుచుకుంటూ వస్తుండగా... అదే సమయంలో దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ బస్సు కౌసర్‌బీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన కౌసర్‌బీని వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మీర్‌చౌక్ పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

చాంద్రాయణగుట్ట: గుట్టు హుక్కా సెంటర్‌పై దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్ నిర్వాహకుడితో పాటు 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇంజన్‌బౌలిలో హమీద్ అనే వ్యక్తి గత కొద్ది రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా హుక్కాసెంటర్‌ను నడుపుతున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు శాలిబండ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు.

చదువు సాగేదెలా?

- సమస్యల్లో జియాగూడ ప్రభుత్వ పాఠశాలలు
- తరగతులకు సరిపడా టీచర్లు లేరు
- విద్యా వలంటీర్లకు జీతాలు లేవు



గౌలి గులాబ్‌సింగ్ ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన భవనంలో జరగని నిర్మాణం

సాక్షి ఫోకస్

జియాగూడ: జియాగూడలోని ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు లోగిళ్లుగా మారాయి. ప్రతి యేటా నూతనంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు వస్తున్నప్పటికీ కనీస సదుపాయాలు, టీచర్ల కొరత, విద్యావలంటీర్లకు జీతాలు లేక పాత భవనం స్కూల్‌ను ఒకే భవనంలోకి మార్చగా ఉన్న భవనం కాస్తా సరిపోక విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గుతున్నారు.

ఇమాంపురా ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో టీచర్ల కొరత...

ఇమాంపురా ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో (ఇంగ్లీష్ మీడియం) 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. రెగ్యులర్ టీచర్లు లేకపోగా ఉన్న నలుగు టీచర్లు కూడా డిప్యూటేషన్ పై ఉన్నారు. ఈ స్కూల్‌లో పనిచేస్తున్న ఏడుగురు విద్యా వలంటీర్లు ఈసారి కూడా పనిచేసేందుకు ఆదేశాలు రాలేదు. గత సంవత్సరం పనిచేసిన విద్యావలంటీర్లకు జనవరి నుండి ఏప్రిల్ వరకు జీతాలు కూడా రాలేదు. అంతకు ముందు డీఈఓ అందుబాటులో ఉన్న బడ్జెట్ నుండి జీతాలు అందజేశారు. కానీ ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుండి జీతాలు ఇవ్వడం లేదు. అలాగే ఈ పాఠశాల తరగతులకు తొమ్మిది మంది ఉపాధ్యాయుల అవసరం ఉంది. మ్యాథ్స్, సోషల్, సెకండ్ గ్రేడ్ టీచర్లుకూడా లేకపోవడంతో విద్యార్థుల చదువులు అంతంత మాత్రమే. 2000 సంవత్సరంలో ఒక టీచర్ బదిలీ కాగా 2014లో అదే టీచర్ ప్రమోషన్ పై వెళ్లారు. అప్పటి నుండి టీచర్ల నియామకం జరగలేదు. సుమారు 229 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. తరగతులకు సరిపడా టీచర్లను నియమించినట్లయితే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

బౌలి గులాబ్‌సింగ్ స్కూల్‌కు భవనం లేదు

గతంలో బౌలి గులాబ్‌సింగ్ ప్రభుత్వ పాఠశాల జియాగూడ ఎంసీహెచ్ క్వార్టర్స్ ప్రభుత్వ స్థలంలో కొనసాగేది. డబుల్‌బెడ్‌రూమ్ నిర్మాణం కారణంగా ఈ పాఠశాలను డోర్‌బస్తీలోని ఇమాంపురా ప్రభుత్వ పాఠశాల భవనంలోకే మార్చారు. ఈ బౌలిగులాబ్ సింగ్ స్కూల్ నిర్మాణానికి స్థలం కూడా కేటాయించినప్పటికి భవన నిర్మాణం జరగలేదు. డబుల్‌బెడ్‌రూమ్ మధ్యన ఉన్న పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి సంఘ విద్రోహులకు ఆనవాలుగా మారింది. ప్రభుత్వం ఒకే భవనంలో రెండు పాఠశాలలు కొనసాగుతుండగా బౌలిగులాబ్ సింగ్ స్కూల్ తరగతులు 1 నుంచి 5 వరకు నడుస్తుంది. 60 మంది విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. తరగతులలో విద్యార్థులు సరిపోక ప్రైవేటు స్కూల్‌కు వెళ్తున్నారు. ఉన్నటువంటి ముగ్గురు టీచర్లు బోధన చేస్తున్నారు.


బూత్ బంగ్లాను తలపిస్తున్న ప్రభుత్వ గులాబ్ సింగ్ బౌలి పాఠశాల పాత భవనం



ఒకే భవనంలో రెండు పాఠశాలలు కొనసాగింపు

మౌలిక వసతులు శూన్యం


కూలిన సుల్తాన్‌షాహీ జీబీపీఎస్ ప్రహరీ

యాకుత్‌పురా: పాతబస్తీలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పలు పాఠశాలల్లో మంచినీటి, పారిశుధ్య, టాయిలెట్ల నిర్వహణ కరువైంది. విద్యార్థులకు బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో లేదు. సొంత భవనాలు లేక పోవడంతో వాల్మీకి నగర్‌లోని సుల్తాన్ షాహి జీబీపీఎస్ పాఠశాల ప్రహరీ కూలిపోవడంతో రక్షణ లేకుండా పోయింది. పాఠశాలలో పారిశుధ్య, మూత్రశాలల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అపరిశుభ్రంగా నెలకొంది. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ అచరణలో అవి ఎక్కడా కనిపించడం లేదు. ప్రహరీ పక్కన పెద్ద ఎత్తున చెత్త చెదారం నిండి పోవడంతో భరింపరాని దుర్వాసన వేదజల్లుతోంది. ఆశించిన స్థాయిలో విద్యార్థులు లేకపోవడంతో బోసిపోయాయి. మొఘల్‌పురా డివిజన్ పరిధిలోని బేరూన్ గౌలిపురా జీబీపీఎస్ పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేక.. తాగడానికి నీరందక విద్యా ర్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన మన బస్తీ–మన బడి కార్యక్రమం ఇప్పటి వరకు చేపట్టలేదు. పాఠశాలలు ప్రారంభమై మూడు రోజులు కాకముందే శాలిబండ జీజీహెచ్ఎస్ పాఠశాలో పదవ తరగతి విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఓ ఉపాధ్యాయుడు పనిష్మెంట్ పేరుతో విద్యార్థినులను తరగతి గది బయట వరండాలో కుర్చోబెట్టాడు. పాఠశాలలో విరిగిన ట్యూబ్‌లైట్లు వేలాడుతున్నాయి.


సుల్తాన్‌షాహీ జీబీపీఎస్‌లో...


ఖాళీగా శాలిబండ జీజీహెచ్ఎస్ తరగతి గది

పాఠశాల పరిసరాలు అధ్వానం



గోల్కొండ: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు మళ్ళీ తెరుచుకున్నాయి. షరా మామూలే అన్నట్లు విద్యార్థులకు మాత్రం పాఠశాల మెయిన్ గేట్ల ముందున్న మట్టి, చెత్త కుప్పలు స్వాగతం పలికాయి. గోల్కొండ, టోలిచౌకి, కార్వాన్ డివిజన్లలో ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన గేట్ల ముందు కుప్పలు, తెప్పలు వ్యర్థాలు పడి వుంటున్నాయి. పాఠశాలల ప్రధాన గేట్ల ముందు వాహనాలు, తోపుడు బండ్లు నిలిచి ఉంటున్నాయి. దీంతో పాఠశాల లోపలికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మరోవైపు డ్రైనేజీ తవ్వకాల సందర్భంగా తవ్విన మట్టిని బడాబజార్‌లోని గోల్కొండ ప్రభుత్వ పాఠశాల ముందు పడి వున్నాయి.

సంతోష్‌నగర్‌లో రక్తదాన శిబిరం


రక్తదానంలో పాల్గొన్న ఉద్యోగులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్ర వ్యవసాయ మెట్ట పరిశోధన కేంద్రం (ఐసీఆర్–సీఆర్ఐడీఏ)లో బుధవారం ప్రపంచ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన్ అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. రక్తం ఇవ్వండి.. ప్లాస్మా ఇవ్వండి.... జీవితాన్ని పంచుకోండి.. తరచుగా పంచుకోండి అనే నినాదంతో ఉద్యోగులు ఈ రక్తదానం కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. సంగం బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లో రక్తదానం


రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న చీఫ్ ఇంజనీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్

సంతోష్‌నగర్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓ టౌన్‌షిప్ ఆడిటోరియంలో 'రక్తదాన్ అమృత్ మహోత్సవ్' కార్యక్రమం జరిగింది. ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ హైదరాబాద్ బృందం ప్రతి రక్తదాతతో 'డోనర్ సర్టిఫికెట్' పంపిణీ సమయంలో ప్రతిజ్ఞ చేయించారు. నగరంలోని అన్ని ల్యాబ్‌ల నుంచి దాదాపు 200 మందికి పైగా రక్తదాతలు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ డాక్టర్ అఖిల, డాక్టర్ ప్రశంస, జి.రమ, స్టాఫ్ నర్సు చీఫ్ ఇంజనీర్ అండ్ ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మోహీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది సేవలు ఎనలేనివి


డాక్టర్ ఆయేషా ముదాషీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: కోవిడ్ క్లిష్టమైన సమయంలో వైద్యులు, సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం యాకుత్‌పురా అల్ ఉస్నా ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ, కార్పొరేటర్‌తో కలిసి విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషియన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ, కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, మహ్మద్ వసీవుద్దీన్, ఆలందార్ వాల్‌జాహి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ అంజి అల్ ఫైడ్, వైద్యాధికారిణి డాక్టర్ ఆయేషా ముదాషీర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

గోల్కొండ : గోల్కొండ శ్రీ జగదాంబిక అమ్మవార్ల హుండీని బుధవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు జరిగింది. మొత్తం రూ. 45,301 ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ లెక్కింపులో అమ్మవారి వృత్తి పని సంఘం అధ్యక్షులు సాయిబాబాచారి, శ్రీ మహంకాళి ఆలయ పూజారి బి. సురేష్ చారి తదితరులున్నారు.

స్వర్ణకార సంఘం ఎన్నికల సన్నాహక సమావేశం




సుల్తాన్‌బజార్: హైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికల సన్నాహక సమావేశం బుధవారం హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ బొడ్డుపల్లి రవి ప్రశాంతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు విజ్జమూరి రాఘవాచారి హాజరై హైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. అదేవిధంగా ఎన్నికల కన్వీనర్‌గా ఎన్నికల కన్వీనర్ శ్రీహరి చారిను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వింజమూరి రత్నమాచారి మాట్లాడుతూ..... హైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం స్వర్ణకారుల సంక్షేమం కోసం ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామదాసు లక్ష్మణాచారి, రాష్ట్ర కార్యదర్శి రాగిఫణి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పోతరాజుల కరపత్రం ఆవిష్కరణ


పోతరాజుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పోతరాజు తల్వార్ శివ, బి.సాయిబాబాచారి

గోల్కొండ: పోతరాజుల విన్యాసాలు, ఘీంఘూకారాలే బోనాల ఉత్సవాలకు హైలెట్ అని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. గోల్కొండ కోట అమ్మవారి ఆషాడ మాస బోనాల జాతర పోతరాజుల కరపత్రాన్ని బుధవారం రిసాల బజార్‌లో ఆయన పోతరాజు తల్వార్ శివతో కలిసి ఆవిష్కరించారు. అమ్మవార్లకు ఏ ఉత్సవాలు జరిగినా పోతరాజుల విన్యాసాలు ఉండాల్సిందేనని ఆయన అన్నారు.

ప్రముఖ కవి డాక్టర్ కిరణ్‌కుమార్‌కు సత్కారం


డాక్టర్ కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అమృత్‌కుమార్ జైన్, రవికుమార్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నవభారత్ నిర్మాణ్ సంఘ్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ చిటికెన కిరణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఏకే జైన్ ఫౌండేషన్ చైర్మన్ అమృత్‌కుమార్ జైన్, నవభారత్ నిర్మాణ్ సంఘ్ అధ్యక్షులు రవికుమార్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. సాహిత్య రంగంలో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో డాక్టర్ కిరణ్‌కుమార్, పలు అవార్డులను పొంది తెలంగాణ సంస్కృతిని చాటుతున్నారన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్


స్టాఫ్‌నర్స్ సంపూర్ణకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రి కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా సేవలందిస్తోందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో బుధవారం తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంచలంచెలుగా గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి చెందుతూ వస్తోందన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసి కూడా గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి ఎంతో చొరవ చూపి ఎంపి లాడ్ నిధులు కేటాయించారని ఆయన అన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో ఈ ఆస్పత్రి నగరంలోనే నెం.1 ఏరియా ఆస్పత్రిగా రూపుదిద్దుకుందని ఆయన అన్నారు. దీనికి తోడు ఈ ఆస్పత్రి గత నెలలోనే కాయకల్ప అవార్డును కూడా పొందిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి ఇన్‌పేషంట్లకు పండ్లు, బ్రెడ్‌లు అందించారు. అనంతరం అత్యుత్తమ సేవలు అందించిన వైద్యులు డాక్టర్ విక్రమ్, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ డాక్టర్ రవూఫ్ ఉద్దీన్, స్టాఫ్ నర్స్ సంపూర్ణకు ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత


సమావేశంలో పాల్గొన్న డీసీపీ కిరణ్‌కారే, ఏసీపీ సతీస్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవి

అబిడ్స్: ప్రజలతో మమేకమయ్యే విధంగా పోలీస్ శాఖ ప్రత్యేక కృషి చేస్తోందని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌కారే పేర్కొన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీలు, కాలనీల అసోసియేషన్ల ప్రతినిధు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కాలనీలు, బస్తీలలో ఎలాంటి సమస్యల ఉన్నా ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల వారు తమ తమ ప్రాంతాలను గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తేవాలని డీసీపీని కోరారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అశ్వక్, ఏసీపీ సతీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

నేడు పల్లెప్రగతి వేడుకలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన రవీంద్రభారతిలో పల్లెప్రగతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పంచాయితీరాజ్ శాఖ కమీషనర్ హన్మంతరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం గత తొమ్మిదేళ్లల్లో జరిగిన అభివృదిని తెలిపే విధంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేస్తున్న పనులను పర్యవేక్షించారు.

మహిళా ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎన్‌జే డైరెక్టర్ జయలత, కమీషనర్ నీతూ ప్రసాద్ తదితరులు

అబిడ్స్: మహిళా ఉద్యోగులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎంఎన్‌జే ఆసుపత్రి డైరెక్టర్ జయలత పేర్కొన్నారు. హైదరాబాద్ టీఎన్జీఓ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగుల కోసం బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలు ఆరోగ్యకరంగా ఉండే విధంగా ప్రతి రోజు కొంతసేపు అయినా వాకింగ్, యోగా చేయాలన్నారు. ఇంట్లో బిజీగా ఉండే మహిళా ఉద్యోగులు కార్యాలయాల్లో కూడా బిజీగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని మరిచిపోతారన్నారు. ప్రతి మహిళా ఉద్యోగి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ నీతూప్రసాద్, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీలు ట్వింకిల్‌జాన్, సుభాషిణి, జిల్లా రిజిస్ట్రార్ సీమా ముజీబ్, టీ ఎన్జీఓస్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పాల్గొన్నారు.